## హైవేపై ట్రాఫిక్ జామ్

చౌటుప్పల్, ఏప్రిల్ 18 : వరుసగా సెలవులు రావడం, పలు స్కూళ్లకు వేసవి ఇవ్వడంతో హైదరాబాద్‌లో ఉండే పల్లెవాసులు గ్రామాల బాట పట్టారు. బైకులు, కార్లు, బస్సుల్లో రావడంతో హైవేపై ట్రాఫిక్ జామ్ అయ్యింది. చౌటుప్పల్ పట్టణంలో శుక్రవారం 65వ జాతీయ రహదారిపై భారీగా వాహనాలు బారులుదీరాయి. పోలీసులు వెంటనే ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.


చౌటుప్పల్ పట్టణంలో జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు


నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I నల్లగొండ, శనివారం 19 ఏప్రిల్ 2025 YADADRI BHUVANAGIRI







# గులాబీల జెండాలమ్మ... ఓరుగల్లు పండుగమ్మ

అందరి దృష్టి బీఆర్ఎస్ రజతోత్సవ సభపైనే..

- విస్తృతంగా, వినూత్నంగా ప్రచార కార్యక్రమాలు
- క్షేత్రస్థాయి వరకు పార్టీ శ్రేణుల సన్నాహక సమావేశాలు
- పాదయాత్రలు, వాల్ రైటింగ్స్, వాల్ పోస్టర్లతో ప్రచారం
- వాడవాడలా 25 ఏండ్ల పండుగ వాతావరణం
- ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లేందుకు సన్నద్ధం


ఇటీవల సూర్యాపేటలో జరిగిన రజతోత్సవ సన్నాహక సభకు ఉత్సాహంగా తరలివెళ్తున్న యువకులు, బీఆర్ఎస్ శ్రేణులు (ఫైల్)

రాజకీయ పార్టీలకు అతీతంగా ఇప్పుడు అందరి దృష్టి ఈ నెల 27న వరంగల్‌లో జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభపైనే కేంద్రీకృతమైందనడంలో సందేహం లేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా గత పక్షం రోజులుగా ఎక్కడ చూసినా బీఆర్ఎస్ పార్టీ 25 ఏండ్ల ఆవిర్భావ పండుగ సందడే కనిపిస్తున్నది. జిల్లా స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులంతా సభకు విస్తృత ప్రచారం కల్పించేందుకు అనేక రూపాల్లో ప్రజల్లోకి వెళ్తున్నారు. ఎక్కడికక్కడ సన్నాహక సమావేశాలు, విద్యార్థి, యువజన నేతల పాదయాత్రలు, వాల్ రైటింగ్స్, వాల్ పోస్టర్లు, సోషల్‌మీడియా వేదికగా ఉద్యమ ఘట్టాలు, అధినేత కేసీఆర్ విశిష్టతను వివరించేలా పోస్టులు.. ఇలా అనేక రూపాల్లో వరంగల్ సభ ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తున్నారు. దీంతో ప్రజలు కూడా రజతోత్సవ సభపైనే ఒక రకమైన ఆసక్తితో కనిపిస్తున్నారు. ఎక్కడ చూసినా వరంగల్ సభపైనే చర్చోపచర్చలు సాగుతుండడం విశేషం.

– నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్18(నమస్తే తెలంగాణ)

2001 ఏప్రిల్ 27న కేసీఆర్ సారథ్యంలో ఉద్యమ పార్టీగా అవతరించి, తెలంగాణ సాధించిన పార్టీగా అధికారంలోకి వచ్చి, రాష్ట్రాన్ని దేశానికే తలమానికంగా తీర్చిదిద్దిన పార్టీగా బీఆర్ఎస్ తన 25 ఏండ్ల ఆవిర్భావ సభకు సన్నద్ధం అవుతున్నది. పార్టీ యావత్తు గత కొద్ది రోజులుగా దీనిపైనే కేంద్రీకరించి ప్రజలందరి పండుగగా భావిస్తూ కార్యరంగంలోకి దిగింది. బీఆర్ఎస్ ఆవిర్భావం తర్వాత తొలి వార్షికోత్సవ సభకు వేదికగా నిలిచిన నల్లగొండ గడ్డ సైతం ఉద్యమకాలంలో అనేక కీలక ఘట్టాలకు వేదికగా నిలిచింది. ఎందరో ఉద్యమకారులు ఇక్కడి నుంచి కేసీఆర్ పిలుపునందుకుని ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో అడుగుపెట్టి కీలక నేతలుగా ఎదిగిన విషయం తెలిసిందే. అందుకే నల్లగొండ జిల్లా గులాబీల ఖిల్లా అన్నట్లుగా 2018–2023 మధ్య కాలంలో బీఆర్ఎస్ పార్టీ 12కు 12 అసెంబ్లీ స్థానాల్లో గులాబీ జెండా ఎగరేసి జిల్లా రాజకీయ చరిత్రలో చెరగని ముద్ర వేసింది. ఈ క్రమంలోనే ఉమ్మడి జిల్లాలో సుమారు 6లక్షలకు పైగా సభ్యత్వంతో బీఆర్ఎస్ పార్టీ అత్యంత పటిష్టవంతంగా రూపుదిద్దుకుంది. అట్లాంటి పార్టీ ఈ నెల 27న వరంగల్ వేదికగా జరుపుకోనున్న రజతోత్సవ బహిరంగసభలోనూ కీలక పాత్ర పోషించేలా సన్నద్ధమవుతున్నది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో ఉమ్మడి జిల్లా కీలక నేతలంతా గత పక్షం రోజులుగా పార్టీ రజతోత్సవం సన్నద్ధంలోనే నిమగ్నమయ్యారు. ఈ నెల 5న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఉమ్మడి జిల్లా నేతలతో భేటీ అయ్యి దిశానిర్దేశం చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి అత్యధికంగా పార్టీ శ్రేణులు, అభిమానులు, సామాన్యులు సైతం తరలివచ్చేలా కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా జనసమీకరణ టార్గెట్‌లు నిర్దేశించుకుని అందుకు అనుగుణంగా జిల్లా పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ జడ్పీ చైర్మన్లు, ఇతర కీలక నేతలంతా రంగంలోకి దిగారు.

### విస్తృతంగా సన్నాహక భేటీలు..

ఉమ్మడి జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా మాజీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ఇప్పటికే పార్టీ ముఖ్య కార్యకర్తలతో సన్నాహక సమావేశాలు ముగిశాయి. తర్వాత దశలో మండలాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. అవి కూడా దాదాపు పూర్తి కావచ్చాయి. అయితే ఈ సమావేశాలకు పార్టీ శ్రేణుల నుంచి కూడా పెద్ద ఎత్తున స్పందన లభిస్తున్నది. ముఖ్యంగా ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. సాగునీరు లేక పంటలు ఎండడం, ధాన్యం కొనుగోళ్లు సరిగ్గా సాగకపోవడం, రుణమాఫీ సగంలోని ఆగిపోవడం, రైతుబంధు పూర్తికాక పోవడం, ఆరు గ్యారెంటీల అమలుతోపాటు ఏ పథకం కూడా ఆచరణలోకి రాకపోవడంతో ప్రజల్లో తీవ్ర నిరాశ నెలకొంది. వీటిన్నింటి నేపథ్యంలో మళ్లీ ఎక్కడ చూసినా కేసీఆర్‌ను, ఆయన పాలనను గుర్తుకు తెచ్చుకుంటున్న సందర్భాలు ఎన్నో కనిపిస్తున్నాయి. ఈ పరిణామాలన్నీ బీఆర్ఎస్ నేతల్లో తిరిగి ఉత్తేజాన్ని నింపుతున్నాయి. భవిష్యత్తు మనదేనన్న ఆశాభావంతో ముందుకు సాగుతూ పార్టీ ఆవిర్భావ సభకు భారీగా తరలివెళ్లేందుకు సన్నద్ధం అవుతుండడం విశేషం. క్షేత్రస్థాయి నుంచి అందుతున్న సమాచారం మేరకు సామాన్యులు సైతం స్వచ్ఛందంగా వరంగల్ సభకు తరలివచ్చేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో ఇప్పుడు ఇలా తరలివచ్చే వారికి వాహన సదుపాయం కల్పించడం పార్టీ నేతలకు సవాలుగా మారింది. ఇప్పటికే ఆర్టీసీ బస్సులతోపాటు అందుబాటులో ఉన్న అన్ని రకాల ప్రైవేటు వాహనాలను బుక్ చేశారు. సొంత వాహనాలు ఉన్న వారూ వాటిల్లోనే వచ్చేలా చర్యలు చేపడుతున్నారు. దీంతో ఈ నెల 27వ తేదీన బహిరంగ సభకు ఉమ్మడి జిల్లా నుంచి లక్ష మందికి పైగా తరలివెళ్లనున్నట్లు అంచనాలు ఉన్నాయి.



### వివిధ రూపాల్లో ప్రచారం

ఇప్పటికే గ్రామ స్థాయి వరకు వరంగల్ సభకు విస్తృత ప్రచారం కల్పించేలా వాల్ రైటింగ్స్ చేపట్టారు. పట్టణాల్లో అన్ని ముఖ్య కూడళ్లతో పాటు మండల కేంద్రాల్లోనూ పెద్ద ఎత్తున ఈ కార్యక్రమం కొనసాగుతున్నది. దీంతో పాటు వాల్ పోస్టర్లతో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. పట్టణాలు, గ్రామాలతోపాటు ప్రైవేటు వాహనాలకు వాల్ పోస్టర్లు అంటిస్తున్నారు. ఇక మరోవైపు పాదయాత్రలతోనూ విద్యార్థి, యువజన నేతలు సందడి చేస్తున్నారు. భువనగిరి మండలం రాయగిరి నుంచి యాదగిరిగుట్ట వరకు బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. బీఆర్ఎస్వీతోపాటు యువనేతలతో కూడిన ఓ బృందం వలిగొండ మండలం వేములకొండ గుట్ట నుంచి యాదగిరిగుట్ట వరకు మూడు రోజులపాటు గ్రామాల్లో ప్రచారం చేసుకుంటూ పాదయాత్రను చేపట్టారు. అర్వపల్లి నుంచి సభా స్థలి వరకు త్వరలో 25మందితో కూడిన ఓ బృందం సైకిల్ యాత్రగా బయల్దేరేందుకు ఏర్పాట్లు చేస్తుకుంటున్నారు. ఇలా అనేక రూపాల్లో వరంగల్ సభకు విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు. దీంతో పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల్లో కూడా సభపై అమితాసక్తి కనిపిస్తున్నది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ ముఖ్య నేతలంతా కలిసికట్టుగా ముందుకు సాగుతూ వరంగల్ సభలో ఉమ్మడి జిల్లా సత్తా చాటేందుకు సన్నద్ధమవుతుండడం విశేషం.


బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

## రజతోత్సవ సభకు జాతరలా తరలిరావాలి

- పదేండ్ల పాలనలో రాష్ట్రాన్ని కేసీఆర్ దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దారు
- బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

రాజాపేట, ఏప్రిల్ 18 : వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జాతరలా తరలిరావాలని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాజాపేట మండల కేంద్రంలోని చెల్మిడి ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుల గుండెలు అదిరేలా సభకు బీఆర్ఎస్ శ్రేణులు తరలిరవాలని కోరారు. నేడు రాష్ట్రంలో ప్రజా పాలన అని చెప్పుకుంటూ నిర్బంధ పాలన కొనసాగిస్తారని మండిపడ్డారు. పాలన చేతకాని కాంగ్రెస్ దద్దమ్మలకు కేసీఆర్‌ను విమర్శించడం తగదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఎనలేని అభివృద్ధి జరిగిందిని, తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే రోల్ మోడల్‌గా మాజీ సీఎం కేసీఆర్ తీర్చిదిద్దారని తెలిపారు. ప్రస్తుతం యావత్ తెలంగాణ ప్రజలు సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని చెప్పారు. రజతోత్సవ సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాడానికి సిద్ధంగా ఉన్నారని, బీఆర్ఎస్ శ్రేణులు సభను విజయవంతం చేయడానికి కృషి చేయాలని కోరారు. రజతోత్సవ సభ చరిత్రలో నిలిచి పోతుందని తెలిపారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్, మాజీ జడ్పీటీసీ చామకూర గోపాల్ గౌడ్, ఏఎంసీ మాజీ డైరెక్టర్లు చింతలపూరి వెంకట్‌రాంరెడ్డి, గుంటి కృష్ణ, గుర్రం నర్సింహులు, మర్ల నాగరాజు, నాయకులు సందిల భాస్కర్‌గౌడ్, ఎర్రగోకుల జశ్వంత్, బెడిదె వీరేశం, కోరుకొప్పుల వెంకటేశ్‌గౌడ్, ఠాకూర్ ధర్మేందర్‌సింగ్, డొంకెన మహేందర్ గౌడ్, చెరుకు కనకయ్య, ఠాకూర్ భగత్‌సింగ్, కొమ్ము పాండు, చెన్న నర్సింహారావు, ఉప్పలయ్య గౌడ్, ఎస్‌కే కరీం, లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.



### బీఆర్ఎస్ పార్టీ శ్రీరామరక్ష

రాష్ట్రానికి బీఆర్ఎస్ పార్టే శ్రీరామరక్షగా నిలుస్తుంది. పదేండ్ల పాలనలో కేసీఆర్ అందరికీ అండగా నిలిచారు. అలాంటి నాయకత్వం లేక ప్రజలు నేడు ప్రజలు పశ్చాత్తాప పడుతున్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకుల మాయ మాటలలు నమ్మి ప్రజలు మోసపోయారని, నేడు అన్ని విధాలుగా గోసపడుతున్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకుల దండుగా కదలి రావాలి.

-బూడిద భిక్షమయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్యే



### గులాబీ శ్రేణులు ఉప్పెనలా తరలిరావాలి

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు గులాబీ శ్రేణులు ఉప్పెనలా తరలిరావాలి. గ్రామాల్లో నాయకులే కథానాయకులై సభకు కదలాలి. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తుంటే కాంగ్రెస్ పార్టీ నాయకలు కేసుల పేరిట గొంతు నొక్కుతున్నారు. ఎన్ని కేసులు పెట్టినా ప్రభుత్వం అవలబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాం చేస్తూనే ఉంటాం. రాష్ట్ర ప్రజలాంతా కేసీఆర్ వెన్నంటే ఉన్నారు.

-కల్లూరి రాంచంద్రారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు


భూదాన్‌పోచంపల్లిలో సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి

## రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపిన బీఆర్ఎస్

- పదేండ్ల కేసీఆర్ పాలనలో సంతోషంగా ప్రజలు
- రజతోత్సవ సభకు దండులా కదలిరావాలి
- మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 18 : తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలో అగ్రగామిగా నిలిపిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి అన్నారు. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభపై శుక్రవారం భూదాన్ పోచంపల్లిలోని జీబీఆర్ గార్డెన్‌లో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేండ్ల కేసీఆర్ పాలనలో ప్రజలు, రైతులు సుఖ సంతోషాలతో జీవించారని, కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు అమలు కానీ హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కార్ ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు గెలిపించుకుని పార్టీ సత్తా చాటాలని, గ్రామాల్లో పార్టీ బలం బలంగా మారాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. నాయకులు కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి రజతోత్సవ సభ ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజలకు ఉత్తేజాన్ని నింపాలని సూచించారు. రజతోత్సవ సభకు గ్రామ గ్రామాన దండులా కదలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాటి సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్ యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ చిట్టిపోలు విజయలక్ష్మి శ్రీనివాస్, మాజీ వైస్ చైర్మన్ బాతుక లింగస్వామి, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కోట మల్లారెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు, సీత వెంకటేశ్, గునిగంటి మల్లేశ్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శులు చిలువేరు బాల నరసింహ, బండారు లక్ష్మణ్ గౌడ్, నాయకులు చక్రపాణి, బలరాం, పగిల రామ్ రెడ్డి, బత్తుల శ్రీశైలం, నోముల మాధవరెడ్డి, చేరాల నరసింహ, సీత శ్రవణ్, చింతకింది కిరణ్, వేముల సుమన్, జింకల యాదగిరి, కర్నాటి అంజమ్మ పాల్గొన్నారు.



శిక్షణ ఇచ్చిన సీనియర్ ప్రొఫెసర్స్‌ను సన్మానిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, వర్క్‌షాప్ కన్వీనర్

## పరిశోధనలపై నైపుణ్యం పెంచుకోవాలి

- ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

రామగిరి, ఏప్రిల్ 18 : ప్రస్తుత కాలంలో పరిశోధనలు కీలకమని, ఆ దిశగా నైపుణ్యాలు పెంచుకోవడం విద్యార్థులు, అధ్యాపకులకు ఎంతో అవసరమని ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. ఎంజీయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఐసీఎస్ఎస్ఆర్–ఎస్ఆర్సీ హైదరాబాద్ సహకారంతో ఎంజీయూలో 'అకాడమిక్ రైటింగ్ ఫర్ పీహెచ్‌డీ స్కాలర్స్ అండ్ యంగ్ టీచర్స్' అనే అంశంపై నిర్వహించే మూడు రోజు వర్క్‌షాప్‌ను శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పరిశోధన అంశాల్లో అకాడమిక్ రైటింగ్ ప్రధాన భూమిక పోషిస్తుందని, శ్రద్ధతో వీటిని నేర్చుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి మాట్లాడుతూ సాధారణ భాషలో తార్కిక ఆలోచనతో రీసెర్చ్ చేయాలని తెలిపారు. ఐసీఎస్ఎస్ఆర్ డైరెక్టర్ బి.సుధాకర్‌రెడ్డి పరిశోధన అంశాల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఎలా వినియోగించవచ్చో పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో వివరించారు. ఐసీఎస్ఎస్ఆర్ పలు ప్రాజెక్టులను అందిస్తుందని, దీనికి మే 2, 2025లోగా యూనివర్సిటీ, అనుబంధ కళాశాలలో పనిచేసే అధ్యాపకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. ఓయూ కామర్స్ డిపార్ట్‌మెంట్ రిటైర్డ్ ప్రొఫెసర్ ప్రశాంత ఆత్మ, ఎంజీయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ హెచ్‌ఓడీ, వర్క్‌షాప్ కన్వీనర్ ఆకుల రవి, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి, ఎంఈడీ, బీఈడీ ప్రిన్సిపాల్స్ బొల్లోజు యాదాచారి, బొడ్డుపల్లి రామకృష్ణ, తాటి శ్రీనివాస్, అధ్యాపకుడు జగదీశ్వర్‌రెడ్డి, స్కాలర్స్ కొసనోజు రవిచంద్ర, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## వీఐపీ యాప్ పేరుతో దగా

- యాప్‌లో పెట్టుబడి పెడితే రెట్టింపంటూ ప్రకటనలు
- చైన్ సిస్టమ్‌తో పెట్టుబడి పెట్టిన బాధితులు
- నల్లగొండ జిల్లాలో సుమారు 2వేల మంది రూ.300 కోట్లు పెట్టుబడి
- నల్లగొండ డీఎస్పీ కార్యాలయం ఎదుట బాధితుల ఆందోళన


నల్లగొండ డీఎస్పీ కార్యాలయం వద్ద ఫిర్యాదు చేసేందుకు వచ్చిన యాప్ బాధితులు

నీలగిరి, ఏప్రిల్18 : రోజురోజుకు కొత్త కొత్త యాప్‌లు సృష్టించి మోసపూరిత ప్రకటనలతో అమాయకపు ప్రజలను ఆశలు చూపి అందినకాడికి దోచుకుంటున్నారు. యాప్‌లో పెట్టుబడి పెట్టి ఒకరిని చేర్పిస్తే కొంత నగదు వస్తుందని ముందుగా ఆశపెట్టి ఎక్కువ సంఖ్యలో సభ్యులు చేరాక బోర్డులు తిప్పేస్తున్నారు. అదే క్రమంలో నల్లగొండ జిల్లాలో వెలుగుచూసింది. మహారాష్ట్రలో పుణే వేదికగా వీఐపీ యాప్ పేరుతో కొత్తగా తీసుకొచ్చి మార్కెట్‌లో ఉంటున్న కొంతమందిని ఏజెంట్లుగా పెట్టుకున్నారు. వారి నుంచి కొంత నగదును పెట్టుబడి పెట్టించి అందులో వారికి కొంత ప్రాఫిట్ వచ్చేలా చేసి నగదును వారి ఖాతాల్లో వేశారు. పెట్టిన పెట్టుబడి రెట్టింపు కావడంతో వారు తమకు పరిచయం ఉన్న వారిని అందులోకి తీసుకొచ్చి అతి తక్కువ సమయంలో డబ్బులు రెట్టింపు అంటూ ఆశలు చూపి సభ్యులుగా చేర్చుకున్నారు. ఇలా నల్లగొండ జిల్లాలో సుమారు రెండు వేలకు పైగా సభ్యులను చేర్పించి ఒక్కొక్కరి నుంచి రూ.5 లక్షల నుంచి 50 లక్షల చొప్పున సుమారు రూ.300 కోట్లను చైన్ సిస్టమ్ పద్ధతిలో పెట్టుబడి పెట్టించారు. కొంతమంది తమ వద్ద ఉన్న డబ్బులు పెట్టగా మరి కొంతమంది అప్పులు చేసి మరి అందులో సభ్యులుగా చేరారు. వారు చేరిన తరువాత ఇంకా సభ్యులు చేరుతావుంటే అధిక మొత్తంలో నగదు వస్తుందని బురిడీ కొట్టించారు. గత రెండు రోజులు క్రితం యాప్ బ్లాక్ అవ్వడంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. సుమారు నాలుగు వందల మంది యాప్ బాధితులు డీఎస్పీ శివరాంరెడ్డిని ఆశ్రయించడంతో నల్లగొండ రూరల్ ఎస్ఐ సైదాబాబు నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు.

### బుద్ధవనం.. నాగార్జునకొండకు టూర్

నందికొండ, ఏప్రిల్ 18 : టూరిజం శాఖ సహకారంతో ప్రతిమ ట్రావెల్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి నాగార్జునసాగర్‌కు ప్రతి నెలా మూడో ఆదివారం ప్రత్యేకంగా పర్యాటకులకు నాగార్జునసాగర్‌కు టూర్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు బుద్ధవనం నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు హైదరాబాద్ నుంచి బయల్దేరి నాగార్జునసాగర్ చేరుకొని బుద్ధవనం, నాగార్జునకొండలను సందర్శించిన అనంతరం రాత్రి 9 గంటల వరకు హైదరాబాద్‌కు పర్యాటకులను చేర్చుతారు. ఒక్కరికి టిక్కెట్ ధర రూ.1,000, ఇందులో టిఫిన్, లంచ్, డిన్నర్‌తో పాటు బుద్ధవనం ఎంట్రెన్స్, నాగార్జుకొండ మ్యూజియం ఎంట్రెన్స్, లాంచీ టిక్కెట్లను కలిపి ధరను నిర్ణయించినట్లు తెలిపారు. పర్యాటకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 950200 2844 నంబర్‌లో సంప్రదించాలని బుద్ధవనం నిర్వాహకులు తెలిపారు.

## మల్లీశ్వరిది ఆత్మహత్య కాదు.. కుల వివక్ష హత్యే

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్


ధర్మారపు మల్లీశ్వరి తల్లిదండ్రులను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

నిడమనూరు, ఏప్రిల్ 18 : ధర్మారపు మల్లీశ్వరిది ఆత్మహత్య కాదని, ఇది ముమ్మాటికీ కుల వివక్ష హత్యేనని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని బొక్కమంతలపాడు గ్రామానికి చెందిన ధర్మారపు మల్లీశ్వరి తల్లిదండ్రులను నాగార్జున సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్‌తో కలిసి శుక్రవారం పరామర్శించారు. మల్లీశ్వరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ సంఘటన జరిగి ఐదురోజులు అవుతున్నా పోలీసులు ఇంతవరకూ ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. మల్లీశ్వరిపై వేధింపులు, కుల వివక్ష కారణంగానే తీరని అన్యాయం జరిగిందన్నారు. ప్రేమపేరుతో మల్లీశ్వరిని మోసగించిన నిందితుడు కుక్కల జాన్‌రెడ్డిని అరెస్ట్ చేసి మిగతా నిందితులను అరెస్ట్ చేయకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. నియోజకవర్గానికి చెందిన ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి దళిత యువతి కుటుంబాన్ని పరామర్శించకపోవడం శోచనీయమన్నారు. మల్లీశ్వరిని వేధించి ఆత్మహత్యకు ప్రేరేపించిన 12 మంది నిందితులపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ మార్కెట్ చైర్మన్ కామర్ల జానయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటి సత్యపాల్, నాయకులు బొల్లం రవి యాదవ్, మెరుగు రామలింగయ్య, సురబి రాంబాబు, ఆదిమల్ల భాస్కర్, తదితరులు ఉన్నారు.



పెద్దవూర మండల కేంద్రంలో రాస్తారోకో చేస్తున్న రైతులు

## ప్రభుత్వం అన్ని రకాల ధాన్యం కొనుగోలు చేయాలి

పెద్దవూర, ఏప్రిల్ 18 : రైతులు పండించిన అన్ని రకాల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ అన్నదాతలు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట కోదాడ–జడ్చర్ల రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ 33 రకాల సన్న, దొడ్డురకం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ అందించాలని కోరారు. ధాన్యం కొనకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని తెలిపారు.